క్లుప్తంగా

విశ్వకర్మకు పూజలు



పూజలు చేస్తున్న జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, భక్తులు

బనగానపల్లె: విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని పలుకూరు గ్రామంలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద ఆచారి ఆధ్వర్యంలో సోమవారం విశ్వకర్మ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవిక వాస్తుశిల్పి, సర్వ లోకాల సృష్టికర్త విశ్వకర్మ అని తెలిపారు. విశ్వకర్మకు గుర్తుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక రాష్ట్రానికి లేదా జిల్లాకు ఆయన పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో బాలహనుమంతు, వెంకటసుబ్బయ్యగౌడ్, రాజు, పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చెరువుపల్లె ఫీడర్‌లో మరమ్మతు పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ గర్జప్ప సోమవారం తెలిపారు. చెరువుపల్లె, వెంకటాపురం, పండ్లాపురం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



ప్రమాద సమయంలో కట్టుకట్టే విధానంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్

బేతంచెర్ల: అత్యవసర సమయంలో అందించే ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని శేషారెడ్డి హైస్కూల్‌లో శేషసాయి మైన్స్ సిబ్బందికి మూడు రోజులుగా జరుగుతున్న ప్రథమ చికిత్స శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో కార్డియో పల్మనరీ (సీపీఆర్) చేసే విధానం తెలుసుకోవడం ద్వారా ప్రాణాలు నిలబెట్టవచ్చన్నారు. వైద్య సదుపాయం అందేలోపు ఫస్ట్ ఎయిడ్ అందించడం వల్ల చాలా వరకు ప్రాణాపాయం లేకుండా చూడవచ్చని తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు ఆస్పత్రికి వెళ్లే వరకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగ సురేంద్ర పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



రంగాపురంలో ఉల్లి దిగుబడులను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నేతలు

బేతంచెర్ల: ప్రభుత్వం పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగా పురం గ్రామ పరిధిలో రైతులు సాగు చేసిన కొర్ర, సజ్జ, మినుము, ఉల్లి పంటలను పరిశీలించారు. పంటలకు మద్దతు ధర లేకపోవడంతో రైతులకు పెట్టుబడులు కూడా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం నాయకులు కిష్టన్న, బాల శేఖర్ ఉన్నారు.

రొనాల్డ్ రాస్‌కు నివాళి



ప్రభుత్వాస్పత్రిలో నివాళులర్పిస్తున్న వైద్యులు

డోన్/డోన్ టౌన్: మలేరియా వ్యాప్తికి కారణమైన దోమను కనిపెట్టి నివారణ కోసం ప్యారాసైట్ మందును కనుగొన్న సర్ రొనాల్డ్ రాస్ వర్ధంతి సందర్భంగా డోన్ ప్రభుత్వాస్పత్రిలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ శశికుమార్ మాట్లాడుతూ.. రొనాల్డ్ రాస్‌కు 1902లో వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించిందని తెలిపారు. అనంతరం సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ రొనాల్డ్ రాస్ జీవిత చరిత్ర గురించి వివరించారు. వైద్యులు భవాని, బాయ్, దాదాబాయ్, స్టాఫ్ నర్సు ఆశ, ఫార్మాసిస్టు సుప్రియ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల పరిస్థితి ఏంటి?



వైద్య విద్యను ప్రైవేటు పరం చేయడం ద్వారా పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. సంపన్నుల పిల్లలు మాత్రమే లక్షలాది రూపాయలు చెల్లించగలరు. పేద విద్యార్థుల పరిస్థితి ఏంటనే విషయం గురించి ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్వహించి పేదలకు వైద్య విద్య అందుబాటులోకి తీసుకురావాల్సింది పోయి ఉన్న కళాశాలలను కూడా ప్రైవేటుపరం చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య. ప్రభుత్వ చర్యలను ఖండిస్తున్నాం. ప్రభుత్వం మరోసారి పునరాలోచించి తన నిర్ణయాన్ని మార్చుకోవాలి.

–పవన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు, ప్యాపిలి



మెడికల్ కళాశాలల నిర్మాణాలు నిలిపివేయడం దారుణం



పేద విద్యార్థులకు సైతం వైద్య విద్యను అందించాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో మెడికల్ కళాశాలల పెంపునకు కృషి చేసింది. రాష్ట్రంలో ఎంతో మంది పేద విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు దక్కాయి. అలాగే ఐదు మెడికల్ కళాశాలలను ఈ ఏడాది ప్రారంభించేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అలాగే వచ్చే ఏడాది ఏడు మెడికల్ కళాశాలల ఏర్పాటుకు ముందు చూపుతో వ్యవహరించింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది ఎంబీబీఎస్ సీట్ల భర్తీని రద్దు చేయడంతోపాటు వచ్చే ఏడాది ప్రారంభం కావాల్సిన మెడికల్ కళాశాలల నిర్మాణాలను నిలిపి వేయడం దారుణం. ఏపీలో వైఎస్ జగన్ హయాంలో ఒక్క మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి కాలేదని, కళాశాలలో బోధన సిబ్బంది లేరని మంత్రి సత్యకుమార్ చెబుతుండడం విచారకరం.

– నాగయ్య, కోవెలకుంట్ల

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- శాంతి ర్యాలీలు, అన్నదానం
- మహ్మద్ ప్రవక్త బోధనలను వివరించిన మత పెద్దలు

ప్యాపిలి: మిలాద్ ఉన్ నబీ (మహ్మద్ ప్రవక్త జన్మదినం)ని సోమవారం డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు దానధర్మాలు చేశారు. ప్యాపిలిలోని జామియా మసీదు నుంచి పట్టణ ప్రధాన వీధుల మీదుగా ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖాజీ, హఫీజ్ మహబూబ్ ఖాన్ మిలాద్ ఉన్ నబీ విశిష్టతను వివరించారు. ప్రవక్త బోధనలను ఆచరించడం ద్వారా ప్రపంచంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరిస్తుందని పేర్కొన్నారు. తమకు ఉన్నంతలో కొద్దిగా పేదలకు దానం చేయడం ద్వారా సంపద మరింత వృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం జామియా మసీదులో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మస్తాన్ ఖాన్, మహబూబ్ సాహెబ్, జహంగీర్, రషీద్, మత్తు బాబా సాహెబ్, మహబూబ్ బాషా, ఖాజా, ఖాజా పీర్, షాషా, ఎస్కే వలి, శేగు, హుసేన్, రహంతుల్లా, బాషా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎంహెచ్‌పీఎస్ అధ్యక్షుడు సయ్యద్ అక్బర్ వలి, సభ్యులు ముస్తాఫా, మాలిక్‌బాషా, బీరువా బాష, ఇర్ఫాన్ ఖాన్, మహబూబ్ బాషా, రఫీ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: పట్టణంలో మిలాద్ ఉన్ నబీని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా మసీదుల్లో ప్రార్థనలు చేశారు. స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలోని జెండా వాలే సాహెబ్ దర్గా నుంచి మత గురువు సయ్యద్ అబ్దుల్ సాహెబ్, ముస్లింలు భారీ ర్యాలీగా పాత ఆంధ్రాబ్యాంక్, ఆస్థానం రోడ్డు, పోలీస్ సర్కిల్ కార్యాలయం, పాత బస్టాండ్ మీదుగా పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు చేరుకున్నారు. మిలాద్ ఉన్ నబీ ప్రాముఖ్యతను బయాన్ ద్వారా వినిపించారు. ర్యాలీలో పలువురు దాతలు స్వీట్లు, బిస్కెట్లు, తాగు నీటి ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ముస్లింలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కూరగాయాల మార్కెట్‌లో మహబూబ్ బాషా ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బనగానపల్లె సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్యాపిలి: ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

భక్తుల సందర్శనార్థం ప్రవక్త కేశాలు

బేతంచెర్ల: మండలంలోని సిమెంట్‌నగర్, గూటుపల్లె, ఆర్‌ఎస్ రంగాపురం, ఎం.పెండేకల్లు, కొలుములపల్లె గ్రామాల్లోని దర్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. అదే విధంగా పట్టణంలోని ఆసర్‌పేట కాలనీలో మండల ఖాజీ నూర్‌అహ్మద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గూటుపల్లె పెద్ద రాజుస్వామి దర్గా ఆవరణలో సౌదీ అరేబియాలోని మదీనా నుంచి తెచ్చిన మహ్మద్‌ప్రవక్త వెంట్రుకలను భక్తుల సందర్శనార్థం ఉంచారు. సమాజంలో శాంతి నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీఠాధిపతి గురుసయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి, మత పెద్దలు గురుసయ్యద్ బాషా ఖాద్రి అన్నారు. అనంతరం అన్నదానం చేశారు.



ప్యాపిలి: పేదలకు సరుకుల పంపిణీ



బేతంచెర్ల: ప్రార్థనా గీతాలు ఆలపిస్తున్న మండల ఖాజీ నూర్‌అహ్మద్, మతపెద్దలు



బేతంచెర్ల: గూటుపల్లె పెద్దరాజు స్వామి దర్గాలో సందర్శనార్థం ఉంచిన మహ్మద్ ప్రవక్త కేశాలు



బనగానపల్లె: ర్యాలీలో పాల్గొన్న మతగురువు సయ్యద్ అబ్దుల్ సాహెబ్, ముస్లింలు

ఘనంగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి పల్లకీపై కొలువుదీర్చారు. డోలు వాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నీట్‌లో విద్యార్థిని ప్రతిభ



కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించిన వర్షా

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కొండపేటకు చెందిన జె.వర్షా నీట్‌లో 544/720 మార్కులు సాధించి కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆమె తండ్రి రామకృష్ణ ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తుండగా, తల్లి ఎంవీ హేమ కుమారి గృహిణిగా ఉన్నారు. వర్షా విజయవాడలోని శ్రీభవిష్య జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీలో 973 మార్కులు సాధించింది.

ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని మృతి



షేక్ రుక్సానా మృతదేహం

బేతంచెర్ల: ఎక్కువ సేపు ఫోన్‌లో మాట్లాడుతోందని కళాశాల యాజమన్యం మందలించడంతో ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని ఆరోగ్యం విషమించడంతో సోమవారం మృతిచెందింది. ఏఎస్‌ఐ లింగమయ్య వివరాల మేరకు.. బేతంచెర్ల సిమెంట్ నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ బాషా, ఫాతిమా కుమార్తె షేక్ రుక్సానా(19) వైఎస్సార్ జిల్లాలోని అయ్యవారు రెడ్డి కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కళాశాలలో ఎక్కువ సేపు ఫోన్ వినియోగిస్తుండడంతో యాజమాన్యం మందలించింది. నెల పాటు కళాశాల నుంచి సస్పెండ్ చేసింది. దీంతో ఇంటికి వచ్చిన షేక్ రుక్సానా మనస్తాపానికి గురై ఈనెల 13వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలకు పూసుకునే సూపర్ వాస్మోలిన్ తాగింది. అపస్మారక స్థితిలో పడివున్న ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అయితే ఆరోగ్యం విషమించడంతో మృతిచెందింది. మృతురాలి తల్లి ఫాతిమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



ఈడిగ ప్రసాద్ (ఫైల్)

డోన్ రూరల్: పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రైతు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని చిన్నమల్కాపురంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈడిగ ప్రసాద్(45) రెండు రోజుల క్రితం గ్రామం సమీపంలోని తన పొలంలో పంటకు పురుగు మందు పిచికారీ చేశాడు. ఈ క్రమంలో ఉన్నఫలంగా స్పృహ తప్పిపడిపోయాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలే సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాఫిక్ అవుట్ పోస్ట్ ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల, ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా

డోన్ టౌన్: పట్టణంలో ట్రాఫిక్‌ను నియంత్రణకు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవుట్ పోస్టును ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా సోమవారం ప్రారంభించారు. ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి డ్రస్సులు అందజేశారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద పట్రోల్ ద్విచక్రవాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్, ఎస్‌ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, మమత పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో విద్యార్థినుల ప్రతిభ

ప్యాపిలి: నంద్యాల పట్టణంలో ఆదివారం జరిగిన బాక్సింగ్ పోటీల్లో ప్యాపిలి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఎనిమిదో తరగతి చదువుతున్న అర్చన, ఏడో తరగతి విద్యార్థినులు ఆయేషా, తబియా సత్తాచాటి గోల్డ్‌మెడల్ సాధించారు. ఏడో తరగతి విద్యార్థిని హసీన కాంస్య పతకం సాధించింది. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయురాలు సరళ, పీఈటీ విజయలక్ష్మి, పాఠశాల సిబ్బంది అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

డోన్ టౌన్: పట్టణంలోని తారకరామనగర్‌లో ఉన్న రామాంజనేయులు ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సోమవారం దాడులు నిర్వహించారు. 10 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.51,150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో లోకేష్, నాగరాజు, రంగయ్య, శ్రీనివాసులు, రమణయ్యతో పాటు మరికొందరు ఉన్నట్లు చెప్పారు.

చీటింగ్ కేసులో వ్యక్తి అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల శ్రీనివాస హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు భరత్‌కుమార్‌ను చీటింగ్ కేసులో అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ ఇస్మాయిల్ సోమవారం తెలిపారు. తప్పుడు పత్రాలతో ఒకరి పేరు మీద ఉన్న సొసైటీ స్థలాన్ని మరొకరి పేరుతో రిజిస్టర్ చేశాడన్నారు. ఈ క్రమంలో 2023లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భరత్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించామని వివరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి





వడ్డె శివశంకర్(ఫైల్), న్యాయం చేయాలని వేడుకుంటున్న కుటుంబ సభ్యులు

డోన్ టౌన్: పట్టణంలోని రైల్వే గేట్ వద్ద తెలంగాణ యువకుడు అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం బాల్‌నగర్ గ్రామానికి చెందిన వడ్డె గౌరమ్మ, శివయ్య దంపతుల రెండో కుమారుడు వడ్డె శివశంకర్(18) కొద్ది రోజుల క్రితం గ్రామస్తులతో కలిసి డోన్‌లోని గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేయడానికి వచ్చాడు. ఏమైందో తెలియదని.. డోన్‌లోని రెండు రైల్వేగేట్ల మధ్య మృతదేహంగా కనిపించాడని వెల్లడించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా మిస్టరీ వీడనుంది.

ఆదుకోవాలని వేడుకోలు

కుటుంబ పోషణ కోసం ఇక్కడికి వచ్చి తమ కుమారుడు మృతిచెందాడని.. తమకు దిక్కు ఎవరూ లేదని మృతుడి తల్లి వడ్డె గౌరమ్మ రోధిస్తూ పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద కనిపించిన అందరినీ వేడుకుంది. ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు వడ్డె శ్రీను బతుకు దెరువు కోసం భార్యతో కలిసి దూరంగా ఉంటున్నాడని వాపోయింది. భర్త దివ్యాంగుడు కావడంతో చిన్నకొడుకు శివశంకర్‌పైనే కుటుంబ భారం పడిందని.. అతను కూడా దూరం కావడంతో తమకు దిక్కు ఎవరని కన్నీటిపర్యం కావడం అక్కడున్న వారిని కలచివేసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

మెడికల్ షాపుల్లో చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్, రాజా టాకీస్ వద్దనున్న మెడికల్ షాపుల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పాత బస్టాండ్ సమీపంలోని మెడికల్ షాపులో రూ.20వేల నగదు, సెల్‌ఫోన్ రీచార్జ్‌కు ఉపయోగించే ఒక ఫోన్ చోరీకి గురైంది. రాజా టాకీస్ సమీపంలోని మెడికల్ షాపులో రూ.2 వేల నగదు చోరీకి గురైనట్లు తెలిసింది. బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చింతలాయిపల్లెలో తాగునీటి కష్టాలు

- అడుగంటిన భూగర్భ జలాలు



మినీ ట్యాంక్ వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

కొలిమిగుండ్ల: వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. చింతలాయిపల్లెలో తాగునీటి సరఫరా అందించే వాటర్ స్కీంలకు చెందిన బోర్లలో నీటి మట్టం పూర్తిగా తగ్గడంతో గ్రామంలో కొన్ని రోజుల నుంచి నీటి సమస్య మొదలైంది. పెద్ద గ్రామం కావడంతో ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా అన్ని కాలనీలకు సక్రమంగా జరిగేది కాదు. నీటి సమస్యను పరిష్కరించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జల్‌జీవన్ మిషన్ కింద అదనంగా మరో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి పైప్ లైన్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేశారు. ప్రస్తుతం వానలు కురవక బోర్లలో భూగర్భ జలాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరా బంద్ అయ్యాయి. బస్టాప్ సమీపంలో మినీ ట్యాంక్ చుట్టుపక్కల నివాసాల ప్రజలకు తప్ప మిగిలిన కాలనీలకు నీటి సరఫరా అందక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. బైక్‌లపై ఇతర కాలనీలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అవుకు రిజర్వాయర్ స్కీం నుంచి రోజుకు ఐదు గంటల పాటు గ్రామానికి నీరు సరఫరా చేస్తున్నారు. జనాభాకు తగ్గట్లు సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలోనే నీటి ఎద్దడి నెలకొనడంతో స్థానికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వారం, పది రోజుల్లో ఆశించిన మేర వర్షాలు కురవకపోతే తాగునీటి సమస్య మరింత జఠిలమవుతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతను అభినందిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: ప్రమాద సమయంలో బాధితులకు చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో మత సామరస్య చైతన్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు నూర్ అహ్మద్, జయంత్ గౌడ్, గౌస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన 125 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మూర్తుజావలి, బాబుల్ రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, పారిశ్రామిక వేత్తలు మారుతి కృష్ణ, గౌరి హుసేన్ రెడ్డి, సుబ్బారెడ్డి, సత్తార్, జాకిరుల్లా బేగ్, మతసామరస్య చైతన్య వేదిక సభ్యులు అబ్దుల్ ఖాదర్, శాలీబేగ్, రషీద్, దస్తగిరి, రవి, జాకీర్, రఫీ, నజీర్ పాల్గొన్నారు.

కుందూనది ఒడ్డున చేతబడి కలకలం



వివిధ ఆకారాలతో బొమ్మలు వేసి పూజలు నిర్వహించిన దృశ్యం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కుందూనది ఒడ్డున చేతబడి కలకలం సృష్టిస్తోంది. సోమవారం తెల్లవారుజామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నది సమీపంలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, తదితర పూజాసామగ్రితో వివిధ రకాల బొమ్మల ఆకారాలు వేసి పూజలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ నెల 18వ తేదీ మహాలయ పౌర్ణమి ఉండడంతో గుప్త నిధుల కోసం ఏవైనా క్షుద్రపూజలు చేశారా? ఇతర కారణాలతో చేతబడి చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చేతబడికి సంబంధించిన వివిధ బొమ్మల పొటోలు పలు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతున్నాయి. ఈ సంఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.

వర్షం కోసం పూజలు



అభిషేకానికి నీళ్లు తీసుకెళుతున్న గ్రామస్తులు

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేటలో వర్షం కోసం రైతులు సోమవారం శివాలయంలో పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, రైతులు ఆలయంలోని శివలింగంపై బిందెలతో నీళ్లు పోశారు. గ్రామస్తులంతా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో చెరువులో నీళ్లు పూర్తిగా అడుగంటిపోయాయి. వ్యవసాయ బోర్లలో నీళ్లు తగ్గిపోయాయి. వరుణుడు కరుణించాలని ప్రత్యేక పూజలు చేసి శివలింగం మునిగే వరకు నీళ్లు పోసినట్లు రైతులు పేర్కొన్నారు.